# గ్రేట్ సెన్సేషన్

-సుమతి

ప్రతిరోజూ 8 గంటలదాకా పక్కపైన కనీసం కదలనైనా కదలని నేను ఆ రోజు 8.30 అయ్యేసరికల్లా ''ఏమోయ్! టిఫిన్ రెడీయా'' అనడం మా శ్రీమతిని లెవెల్ దాటి ఆశ్చర్యపరచింద నడంలో సందేహంలేదు.

నేను టై సర్దుకుని నిలువుటద్దం ముందు ఇందాక పడ్డ పాట్లకు ఫినిషింగ్ టచ్ ఇస్తూ స్టైల్‌గా ఆఖరుసారి దువ్వుకుంటుంటే ఎందుకో నాకు నేనే భలేగా ముద్దొచ్చేస్తున్నట్లు అనిపిస్తోంది. దాన్ని మా శ్రీమతి కనఫర్మ్ చెయ్యనే చేసేసింది.

''ఏంటండీ శ్రీవారూ! మరీ చందమామలా మెరిసి పోతున్నారు'' అంది.

ఏదో ఒక మోస్తరు అందగాడ్నే నేను. నాతో పోటీపడే లెవెల్లో మా ఆఫీసులో ముగ్గురు నలుగురు వున్నారులెండి. నా టెన్షనంతా వారి గురించే. ఎందుకంటే ఇవాళే నిజమైన పోటీ మరి.

టిఫిన్ గబగబ లాగించేసి ఎలాగోలా బైటపడ్డాను. ఫ్లాష్‌బాక్‌లో సినిమా రీలు కళ్లముందు తిరిగింది. ఆఫీసులో స్టాఫంతా మగాళ్లే. అందుకే అంత ఇంట్రెస్టింగ్‌గా ఉండదనుకునేవాళ్లం. మాకు వరంగా మా హెడ్డాఫీసు నుంచి ఒక లేడీ అపాయింట్‌మెంట్ వచ్చీరావడంతోటే సంచలనం బయలుదేరింది. పేరు లీక్ అవడంతో అదో పెద్ద స్పెషల్ సెన్సేషనే అయింది. ఎందుకంటే పేరు కుమారి వనజ.

ఆ 'కుమారి' పదం అమృతవర్షంలా అనిపించింది. ఇంటికి వెళ్లగానే చిటపటలతో అస్తమానం ఇది కావాలి అది కావాలనే టెండర్లతో వేధించే భార్య అంటే ఆ క్షణం బోర్ అనిపించిందండోయ్. పాత రీలు ఇలా తిరుగుతుండగానే బస్ రానే వచ్చింది. ఆఫీస్ చేరేసరికి పావు తక్కువ తొమ్మిది అయింది. ఆఫీస్ టైమ్ తొమ్మిదిన్నర. ఆమె జాయిన్ అవడానికి తొందరగా వచ్చేస్తుందేమోనని ఆశ. అడుగుపెట్టగానే హడిలిపోయాను. వర్కింగ్ అవర్స్‌కన్నా సిన్సియర్‌గా తమ సీట్లలో బాగా ముస్తాబై కూర్చున్న అందర్నీ చూస్తుంటే చిరాకేసింది. అయినా ఎంత పూసినా బంగారు మెరుపు బంగారానిదే అని ధైర్యం చెప్పుకున్నా విధిలేక.

విధిలేక సీటులో చతికిలబడ్డా చూపు మాత్రం గడియారం ముల్లు మీదనే కేంద్రీకృతమై వుంది. నేనేకాదు ఇంచుమించు అందరూ చేతికున్న వాచీవంకా, గోడపై వున్న గడియారంవంకా అసహనంగా మార్చిమార్చి చూస్తున్నారు. మేము ఎదురుచూస్తున్న శుభగడియ రానే వచ్చింది.

చిన్నగా వినిపించిన కిర్రుమని శబ్దంతోపాటు ''నమస్తే మేడమ్' అనే మా వాచ్‌మెన్ సంకేతం ఒక్కసారిగా అందరి తలలు ఎత్తేలా చేసింది. అంతా ఒక్కక్షణం కదలిక లేని శిల్పాలైపోయాము. పైనుంచి కిందదాకా అలా తేరిపార చూస్తూ వుండిపోయాం. లేత గులాబీరంగు ప్లైన్ షిఫాన్ చీరకు అదే రంగు అద్దలు కుట్టిన బ్లౌజ్‌తో చూస్తూనే కొరుక్కుతిందామనేంత ఎర్రగా లిప్‌స్టిక్ చేసిన పెదాలు, బుగ్గలు అంత బాగాలేవు లెండి. కళ్లు కాస్త కూలింగ్ గ్లాసెస్ వెనుక దాగుండిపోయాయి. బ్యూటీపార్లర్ షేప్ చేసిన చక్కని కనుబొమలు. ముఖానికి సరిపడే హెయిర్ స్టైల్. మొత్తానికి ఎలాంటి మగాడి చూపునైనా మరల్చుకోగలిగిన అందం ఆమెని అనడం అతిశయోక్తి కానేకాదు. ఇక అసలు ప్రశ్నంతా తను ఎవర్ని చూసి స్మైల్ ఇస్తుందా అని!

అవాక్కయిపోయి తనకేసి చూస్తున్న అందర్నీ చూసి క్షణం ఆశ్చర్యపోయి తేరుకుని అందరికేసి చిరునవ్వుతో చూస్తూ సోయగంగా మా సీట్లముందు నుంచి కదిలిపోయింది మేనేజర్ ఛాంబర్‌వైపు. అది అద్దాల ఛాంబర్ కావడంమూలాన అంతా అటువైపే చూసారు.. ఆమె మేనేజర్‌కు విష్ చేస్తూ లోపలకు అడుగుపెట్టింది. దగ్గరికెళ్లి అపాయింట్‌మెంట్ లెటర్ చూపించింది. బదులుగా అతను స్టాఫ్ రిజిస్టర్ చూపించి ఆమె చేతిని తాకుతూ పెన్ అందించాడు. ఆమె సంతకం పెట్టడం చూసి అతని ముఖం నల్లగా మాడిపోయింది. ఏదో అతను ఆవేశంగా అడుగుతున్నాడు. ఆమె భయం భయంగా చూస్తోంది. నరాలు చిట్లిపోయేంతటి టెన్షన్. ఎందుకు... అసలు ఏం జరుగుతోందక్కడ? బెల్ వినిపించడంతో ఫ్యూన్ వెళ్లాడు. విషయం వినగానే అతను డల్ అయిపోయి ఆమెను వెంట తీసుకుని రాసాగాడు. ఆమె బయటకు వచ్చి ఫ్యూన్ వెంట నడుస్తూ స్టోర్ రూమ్‌లోకెళ్లింది. కాసేపటికి ఒక చేతిలో చీపురు, మరో చేతిలో ఫినాయిల్ బాటిల్‌తో మొదటి సీటులో వున్న నాకేసి రావడం చూడగానే మతి పోయినంత పనయింది. అంత ఆవేశం మీదా నీళ్లు చల్లినట్టయింది. నా దగ్గరకు వచ్చి ''బాబుగోరు! బాత్‌రూమ్ ఏడనో జరంత చెప్పరాదు'' అంది. బదులు మాట్లాడడానికి మాటలు రాక చేయి చాచి చూపించాం.

అంతా కలసి సామూహికంగా చర్చించు



కున్నప్పుడు ఏతావాతా తేలిందేమంటే పదిరోజుల క్రితం వచ్చిన అపాయింట్‌మెంట్ అయితే లేడీదని, పేరు చూసి విపరీతమైన సంతోషంతో విషయం పెద్దగా పట్టించుకోలేదు. ఏదో క్లర్క్ అపాయింట్‌మెంట్ అనుకున్నాంగానీ రెండు నెలలక్రితం మేము స్వీపర్ పోస్టు కొరకు పెట్టుకున్న అప్లికేషన్‌కు హెడ్డాఫీసు శాంక్షన్ చేసిందనే విషయం మరచి పోయాం. ఆ రోజంతా ఆఫీసులో అందరూ మూడీగానే వుండిపోయారు.

ఇంటికి వచ్చీ రాగానే అద్దంలో నా ముఖం చూసుకున్న నాకు ''వెధవన్నర వెధవలు! కొద్దిగా శాతం నేర్చుకో. ఆవేశంలో అసలు విషయమే తెలుసుకోలేకపోయావే'' అని కిలకిలా నవ్వులు. నా అంతరాత్మ ఆ ప్రాక్టికల్ జోక్‌కు స్పందించి నవ్విన నవ్వులు.

★